సాక్షి ప్రకాశం

బుధవారం | 12 | ఏప్రిల్ | 2023



పూలే జీవితం ఆదర్శం

జ్యోతిరావుపూలే జయంతి కార్యక్రమాన్ని జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలులో బాలినేని, కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ పూలేకి నివాళులర్పించారు. - 8లో..



సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

సీఎం వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
35 /24

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.



సంక్షేమానికి మరో అడుగు

నవరత్నాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాల్లో మరో బృహత్తర కార్యక్రమానికి ప్రకాశం జిల్లా వేదిక కానుంది. ఈబీసీ నేస్తం రెండో విడత నగదు పంపిణీ కార్యక్రమాన్ని మార్కాపురంలో నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. సీఎం హోదాలో ఇప్పటి వరకు తొమ్మిదిసార్లు జిల్లాకు వచ్చిన వైఎస్ జగన్ నేడు పదోసారి రానున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- ప్రకాశంలో మరో బృహత్తర పథకానికి శ్రీకారం
- నేడు మార్కాపురంలో ఈబీసీ నేస్తం రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- నాడు–నేడు, ఆసరా, మహిళా సంఘాల సున్నావడ్డీ కార్యక్రమాలు జిల్లాలోనే ప్రారంభం
- గతంలో పశ్చిమ ప్రకాశంలో వెలిగొండ ప్రాజెక్టు వద్ద సీఎం సమీక్ష
- సీఎం సభకు భారీ ఏర్పాట్లు
- సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత పదోసారి జిల్లాకు వస్తున్న వైనం





మార్కాపురంలో ముస్తాబైన సీఎం సభా ప్రాంగణం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

మరో బృహత్తర పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో బుధవారం ప్రారంభించనున్నారు. ఈబీసీ నేస్తం రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు మార్కాపురం రానున్నారు. సంక్షేమ పథకాలను ఒక ఉద్యమంలా చేపడుతూ వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అడుగులు ముందుకేస్తున్నారు. 2014 ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒకపక్క అమలు పరుస్తూనే మరోపక్క ఇవ్వని హామీలను సైతం నెరవేరుస్తూ సంక్షేమ ప్రభుత్వంగా పాలన సాగిస్తున్నారు. నవరత్నాల ద్వారా తన మ్యానిఫెస్టోను అమలు చేస్తూ ఏదో ఒక పథకం ప్రతి గడపకు చేరేలా ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రకాశం జిల్లా కేంద్రంగా ప్రారంభించారు. ఒకటి కాదు రెండు కాదు అనేక సంక్షేమ పథకాలను ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని పలు పట్టణాల నుంచి సీఎం జగన్ ప్రారంభించారు. జిల్లాకు ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తూ రాష్ట్ర స్థాయిలో నిర్వహించే కార్యక్రమాలను ఇక్కడ నుంచే ప్రారంభించటం ఒక మంచి పరిణామంగా జిల్లా ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. సీఎంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మే 31, 2019వ తేదీన ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఇప్పటికే జిల్లాకు తొమ్మిదిసార్లు వచ్చారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఈబీసీ నేస్తం రెండో విడత నగదు బదిలీ కార్యక్రమాన్ని బుధవారం మార్కాపురం పట్టణాన్ని వేదికగా చేసుకొని ప్రారంభించేందుకు సీఎం వైఎస్ జగన్ పదోసారి రానున్నారు. అందు కోసం మార్కాపురంలోని ఎస్వీకేపీ డిగ్రీ కాలేజీలో పెద్ద ఎత్తున కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పశ్చిమ ప్రకాశంలో సీఎం హోదాలో బహిరంగ సభ మొదటి సారి నిర్వహిస్తుండటంతో జిల్లా నలుమూలల నుంచి భారీగా జనాలు తరలిరానున్నారు.

ఈబీసీలలో ప్రధానంగా రాష్ట్రంలో కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, ఆర్య వైశ్య, క్షత్రియ, వెలమ సామాజిక వర్గాలతోపాటు ఇతర అగ్రవర్ణాల్లోని పేదలు 39,409 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున మహిళల ఖాతాల్లో రూ.59,11,35,000 జమచేయనున్నారు. జిల్లాలో కమ్మ 12,881, రెడ్డి 20,932, ఆర్యవైశ్య 4032, బ్రాహ్మణ 759, క్షత్రియ 250, వెలమ 93, ఇతర అగ్రవర్ణ పేదలు 462 వెరసి 39,409 కుటుంబాలకు ఈ ప్రయోజనం దక్కనుంది.

మొదటిసారి..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన ఏడాదే 2019 నవంబర్ 14న ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ కార్యక్రమాన్ని ఒంగోలు నగరంలోనే ఆరంభించారు. ఆధునీకరణలో భాగంగా చేపట్టిన మొదటి విడత ''నాడు-నేడు'' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 45 వేల ప్రభుత్వ పాఠశాలను మెరుగుపరిచేందుకు రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తూ ఒంగోలు నగరంలోని పీవీఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలోనే శంకుస్థాపన చేశారు. మొదటి విడతలో 15,715 పాఠశాలలను రూ.3,500 కోట్ల ఖర్చుతో బాగు చేశారు.

రెండోసారి..

ప్రకాశం జిల్లాకు జీవనాడి వంటి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు, ఆ పనులను స్వయంగా పరిశీలించేందుకు 2020 ఫిబ్రవరి 20న దోర్నాల మండలంలోని ప్రాజెక్టు సొరంగ మార్గాల తవ్వకం వద్దకు వచ్చారు. వెలిగొండ ఒకటో టన్నెల్‌ను వేగవంతంగా పూర్తి చేయించారు. ప్రకాశంతోపాటు నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాలకు కూడా ప్రయోజనం చేకూరేలా 4.473 లక్షల ఎకరాలకు సాగునీరు, 15.25 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించేలా మొత్తం 30 మండలాలకు ఉపయోగపడేలా రూపకల్పన చేశారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ పనులు ముందుకు సాగేందుకు రూ.1,595.39 కోట్లు మంజూరు చేశారు. వెలిగొండ ప్రాజెక్టు జలాశయం నల్లమల సాగర్‌ను 53.85 టీఎంసీ సామర్థ్యంతో నీటిని నింపాలన్నదే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. 2023–24 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.101.47 కోట్లు కేటాయించింది.

మూడోసారి...

డ్వాక్రా అక్కచెల్లెమ్మలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన 'ఆసరా' కార్యక్రమాన్ని కూడా రెండో విడత ఇక్కడ నుంచే ప్రారంభించారు. 2021న అక్టోబర్ 7వ తేదీ ఒంగోలు నగరంలోని పీవీఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల వేదికగా నిర్వహించారు. ఆసరా రెండో విడతలో 7.97 లక్షల గ్రూపుల్లోని 78.76 లక్షల మంది డ్వాక్రా గ్రూపు మహిళలకు రూ.6,439 కోట్లు పొదుపు ఖాతాల్లో జమ చేశారు.

నాలుగోసారి..

2021 డిసెంబర్ 27వ తేదీ యర్రగొండపాలెం వచ్చారు. అప్పటి విద్యాశాఖ మంత్రి, ప్రస్తుత మున్సిపల్ శాఖ మంత్రి అయిన ఆదిమూలపు సురేష్ కుమారుని వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఐదోసారి..

మరోసారి ఒంగోలులో సీఎం వైఎస్ జగన్ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు 'వైఎస్సార్ సున్నా వడ్డీ' మూడో విడత పంపిణీ కార్యక్రమాన్ని 2022 ఏప్రిల్ 22న ఇక్కడ నుంచే ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 9,76,116 పొదుపు సంఘాలకు సంబంధించిన 1.02 కోట్ల మంది మహిళా సభ్యులకు వైఎస్సార్ సున్నా వడ్డీ ప్రయోజనాన్ని చేకూర్చారు. 2020–21 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు సంబంధించిన వడ్డీ డబ్బు రూ.1,261.07 కోట్లు ప్రభుత్వం ఆయా సంఘాల బ్యాంకు రుణ ఖాతాల్లో జమచేశారు.

ఆరోసారి..

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఆమె తనయుడు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డిల ఆధ్వర్యంలో 2022 ఆగస్టు 24న చీమకుర్తిలో నిర్వహించిన కార్యక్రమానికి వచ్చారు. బూచేపల్లికి చెందిన ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డిల విగ్రహాల ఆవిష్కరణకు చీమకుర్తికి వచ్చారు.

ఏడోసారి..

దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కుమారుని వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యేందుకు 2022 డిసెంబర్ 20వ తేదీన దర్శి పట్టణానికి వచ్చారు.

ఎనిమిదో సారి..

రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తల్లి థెరీసమ్మ మృతి చెందినప్పుడు నివాళులర్పించేందుకు 2022 డిసెంబర్ 27న యర్రగొండపాలెం వచ్చారు.

తొమ్మిదోసారి..

కొండపి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు తల్లి కోటమ్మ మృతి చెందటంతో నివాళులర్పించేందుకు 2023 మార్చి 27వ తేదీన టంగుటూరు మండలం కారుమంచి గ్రామానికి వచ్చారు. కోటమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

న్యూస్‌రీల్

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- విద్యుత్ శాఖ ఎస్ఈ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశం విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యనారాయణ

కొమరోలు: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని ప్రకాశం జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ కె.బి.జి.సత్యనారాయణ తెలిపారు. కొమరోలు పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ మంగళవారం ప్రకాశం జిల్లా ఎస్ఈ సత్యనారాయణ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సత్యనారాయణ మండల విద్యుత్‌శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న కాలనీల్లో 660 కాలనీలు ఉండగా 420 కాలనీలకు విద్యుత్ సరఫరా, వీధిలైట్ల సౌలభ్యం కల్పించామని, మిగిలిన 20 శాతం కాలనీలకు త్వరలోనే కల్పించనున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.400 కోట్ల మేర విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వ శాఖలకు సంబంధించి రూ.300 వరకు ఉండగా సాధారణ వినియోగదారుల నుంచి రూ.100 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉందని చెప్పారు. జిల్లాలో 490 గ్రామ సచివాలయాల్లో ఏఎల్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గిద్దలూరు నియోజకవర్గంలో 6 మండలాలకు ఒక్కో నూతన సబ్‌స్టేషన్ మంజూరైనట్లు, వాటిని త్వరలోనే ప్రారంభించారన్నారు. కొమరోలు పట్టణంలో విద్యుత్ లోవోల్టేజ్ వస్తున్నందున ఈవిషయాన్ని తెలుసుకున్న ఎస్ఈ విచారణ చేపట్టి కొత్తగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏడీ డి.వై.శేషగిరిరావు, ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉన్నాం

- జీజీహెచ్‌లో కోవిడ్ వైద్య సేవల కోసం ముందస్తు జాగ్రత్తలు
- జీజీహెచ్ సూపరింటెండెంట్, డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్‌ల పరిశీలన



ఆక్సిజన్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్, ఇతర వైద్యాధికారులు

ఒంగోలు అర్బన్: కోవిడ్ వ్యాప్తి చెందినా వైద్య సేవలు అందించేందుకు అన్నీ విధాలుగా అప్రమత్తంగా ఉన్నామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్ తెలిపారు. మంగళవారం కోవిడ్ వైద్య సేవలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లను డీసీహెచ్ఎస్ సత్యనారాయణమూర్తి, ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ సురేష్‌లతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కోవిడ్ వైద్య సేవలపై జీజీహెచ్‌లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు. 100 పడకలతో పాటు, 240 వెంటిలేటర్లు, 700పైగా ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌లు, ఆక్సిజన్ ప్లాంట్‌లు సిద్ధంగా ఉన్నాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మాక్ డ్రిల్ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఒక్క కోవిడ్ కేసు మాత్రమే జీజీహెచ్‌లో ఉందన్నారు. రోజుకు 150 నుంచి 200 వరకు కోవిడ్ పరీక్షలు వీఆర్‌డీఎల్ ద్వారా చేస్తున్నామన్నారు. గతంలో కోవిడ్ రెండు దశల్లో అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిలో ఆర్ఎంఓ చైతన్య వర్మ ఇతర వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు యథావిధిగా పాఠశాలల నిర్వహణ

ఒంగోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం ఈబీసీ నేస్తం రెండో విడత పథకాన్ని ప్రారంభించేందుకు మార్కాపురం రానున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలకు సెలవు ప్రకటించారంటూ కొన్ని మీడియా సంస్థల్లో వస్తున్న వార్తలను జిల్లా విద్యాశాఖ ఖండించింది. తాము ఎటువంటి సెలవు ప్రకటించలేదని డీఈవో రమేష్ స్పష్టం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నీ యథావిధిగా పనిచేస్తాయని చెప్పారు.

సీఎం పర్యటనకు ట్రైల్ రన్

- పరిశీలించిన సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్



సీఎం కాన్వాయ్ ట్రైల్ రన్



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్

మార్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం పర్యటనపై సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ సభా ప్రాంగణానికి వచ్చి పరిశీలించారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిలతో మాట్లాడి పర్యటన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. తమ అభిమాన నేతను స్వాగతిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కటౌట్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. దీంతో పట్టణమంతా సందడి వాతావరణం నెలకొంది.

ట్రైల్ రన్ సక్సెస్

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అధికారులు ముందస్తుగా ట్రైల్ రన్ నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో హెలికాప్టర్ మార్కాపురం పట్టణానికి వచ్చి బాయ్స్ హైస్కూల్‌లో హెలిప్యాడ్ వద్ద దిగింది. పట్టణాన్ని హెలికాప్టర్‌లో పరిశీలించారు. సాయంత్రం 5 గంటలకు ఎస్పీ మలికా గర్గ్ ఆధ్వర్యంలో సీఎం కాన్వాయ్ ట్రైల్ రన్ నిర్వహించారు. కలెక్టర్ దినేష్ కుమార్, సబ్‌కలెక్టర్ సేతుమాధవన్, స్పెషల్ కలెక్టర్ సరళా వందనం హెలిప్యాడ్, సభాప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు.

నేడు సీఎం పర్యటన ఇలా..



డయాస్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీ, కలెక్టర్, ఎస్పీ, జేసీ

మార్కాపురం: ఈబీసీ నేస్తం రెండో విడత నగదు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మార్కాపురం రానున్నట్లు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తెలిపారు. స్థానిక ఎస్వీకేపీ కళాశాలలో సీఎం సభ ఏర్పాట్లను మంగళవారం మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్‌లతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే అనంతరం మీడియాకు సీఎం పర్యటన వివరాలు వెల్లడించారు. ఉదయం 9 గంటలకు సీఎం ఇంటి నుంచి బయల్దేరి గం.9.05 కు తాడేపల్లిలోని హెలిప్యాడ్ చేరుకుంటారు. అక్కడ నుంచి బయలుదేరి గం.9.55కు మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. గం.10.05కు ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి గం.10.15కు డిగ్రీ కళాశాలకు చేరుకుంటారు. మార్కాపురం పట్టణానికి సాగర్ నీళ్ల అందించే జోన్–2 నీటి పథకానికి పొదిలి పెద్ద చెరువు పైప్ లైన్ పనులకు భూమి పూజ చేస్తారు. గం.10.25 నుంచి గం.10.35 వరకు ఫొటో గ్యాలరీ సందర్శించి ఈబీసీ లబ్ధిదారులతో మాట్లాడతారు. గం.10.35 కు వేదిక మీద జ్యోతి ప్రజ్వలన చేస్తారు. 11 గంటలకు ఈబీసీ నేస్తం పథకాన్ని ప్రారంభించిన అనంతరం గం.11.15 వరకు లబ్ధిదారులతో ఇంట్రాక్షన్ ఉంటుంది. అక్కడి నుంచి 12 గంటల వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారు. 12 గంటలకు ఈబీసీ నేస్తం నిధులను డీబీటీ విధానంలో విడుదల చేస్తారు. గం.12.15కు రోడ్డు మార్గాన హెలిప్యాడ్ చేరుకుంటారు. గం.12.15 నుంచి గం.12.35 వరకు స్థానిక నేతలతో మాట్లాడతారు. అనంతరం గం.12.40కి హెలిప్యాడ్ వద్దకు వెళ్లి తాడేపల్లి బయలుదేరుతారు.

ఏర్పాట్లు పూర్తి:

సభావేదికతో పాటు హెలిప్యాడ్ నిర్మాణం కూడా పూర్తయింది. ఏర్పాట్లను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, ఆయన సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ బాపన్ రెడ్డి, ఎంపీపీ అరుణ చెంచిరెడ్డిలతో కలసి పరిశీలించారు. కౌన్సిలర్లకు ఏర్పాట్ల బాధ్యతలు అప్పగించారు. సుమారు 40 వేల మంది సభా ప్రాంగణంలో కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. వచ్చిన వారందరికీ చల్లటి మజ్జిగ, మంచి నీళ్లు, స్నాక్స్ అందించనున్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎండ వేడి తట్టుకునేందుకు కూలర్స్, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు.

అప్పులు చేసి జేబులు నింపుకున్న టీడీపీ

- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: అభివృద్ధి పేరుతో లక్షల కోట్లు అప్పులు చేసిన తెలుగుదేశం పార్టీ జన్మభూమి, నీరు చెట్టు పేరుతో జేబులు నింపుకుందని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఒంగోలు లోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభకు సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ టీడీపీ హయాంలో పేదల పొట్టలు కొట్టడం తప్ప వారి సంక్షేమానికి చేసిందేమీ లేదని విమర్శించారు. చంద్రబాబు పాలనలో తీసుకొని వచ్చిన అప్పులను ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఒంగోలును తామే అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న ఆ పార్టీ నాయకుడు నిర్దిష్టంగా ఫలానా అభివృద్ధి చేశామని చెప్పగలరా అని నిలదీశారు. ఒంగోలుకు రిమ్స్ హాస్పిటల్, చెక్‌డ్యాంలు తెచ్చామని, తాజాగా మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.300 కోట్లు తీసుకొచ్చామని వివరించారు. మల్లవరం ప్రాజెక్టు నుంచి ఒంగోలుకు నీళ్లు తెచ్చేందుకు రూ.121 కోట్లు తెచ్చినట్లు చెప్పుకుంటున్న టీడీపీ నాయకులు అందులో రూ.70 కోట్లు కార్పొరేషన్ మీద భరించలేని భారం వేశారన్నారు. మంచినీటి సమస్య పరిష్కరించేందుకు తాము తీసుకొని వచ్చిన రూ.300 కోట్లు మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఒంగోలు నగరంలో మొత్తం మంచినీటి పైపులను మార్చేసి కొత్త పైపులు వేస్తామని, నీళ్ల కోసం అర్ధరాత్రిళ్ల వరకు వేచి ఉండకుండా పట్టపగలే నీటి సరఫరా చేస్తామని తెలిపారు. 25 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుకున్న టీడీపీ నాయకుల కుట్రలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా పేదలకు స్థలాలు ఇచ్చి తీరుతామని తేల్చి చెప్పారు.

పూలే భవనం నిర్మిస్తాం...

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని నివాళి అర్పించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రజల మధ్య సమానత్వం కోసం జ్యోతిరావు పూలే అహర్నిశలు పాటుపడ్డారని చెప్పారు. ఒంగోలు నగరంలో జ్యోతిరావు పూలే భవన నిర్మాణాన్ని చేపడతామని ప్రకటించారు. భవనం కోసం స్థలాన్ని చూడాలని కలెక్టర్‌కు చెప్పినట్లు తెలిపారు.

పేదల ఖాతాల్లో రూ.2 లక్షల కోట్లు..

పేద ప్రజలకు నవరత్నాలు ఇచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల కోట్లను ప్రజల ఖాతాల్లో వేసిందని బాలినేని చెప్పారు. కోవిడ్ వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. దేశంలో అప్పులు చేయని రాష్ట్రం ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా అప్పులు చేస్తున్నారని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వారు ఎందుకు అప్పులు చేస్తున్నారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి బొట్ల రామారావు, కఠారి శంకర్, వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లు షేక్ సుభానీ, మనోజ్ కుమార్, పార్టీ నాయకులు దామరాజు క్రాంతి కుమార్, తమ్మినేని మాధవి, బేతంశెట్టి హరిబాబు, పి.శ్రీను, చల్లా తిరుమల యాదవ్, రంగారావు, నాగం శేషగిరి రావు, త్రిష్టిక వాసు, దాసరి కరుణ, షేక్ మహబూబ్ పాల్గొన్నారు.

సీఎం సభను జయప్రదం చేయండి

- మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె



మాట్లాడుతున్న మంత్రి సురేష్, పక్కన కేపీ, జంకె

మార్కాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం మార్కాపురం పట్టణంలోని ఎస్వీకేపీ డిగ్రీ కళాశాలలో ఈబీసీ నేస్తం–2 కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వస్తున్నారని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాత్రి ఎస్వీకేపీ డిగ్రీ కళాశాలలోని సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈబీసీ నేస్తం రెండో విడత కార్యక్రమాన్ని సీఎం ప్రారంభిస్తున్నారని చెప్పారు. సీఎం రాకతో ప్రజల్లో, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొందన్నారు.

8 గంటలకే సభా ప్రాంగణానికి చేరుకోండి :

సీఎం సభకు హాజరయ్యే అభిమానులు, కార్యకర్తలు, మహిళలు ఉదయం 8 గంటలకే సభా ప్రాంగణానికి చేరుకోవాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యంగా మహిళలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, కౌన్సిలర్లు డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, ఉత్తమ్ కుమార్, బాబీ, కశెట్టి నగేష్, కొత్త కృష్ణ, వనజాక్షి, భాగ్యలక్ష్మి, సిరాజ్, డీవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైకోర్టు జడ్జి పరామర్శ



శారదాదేవిని పరామర్శిస్తున్న హైకోర్టు జడ్జి రామకృష్ణప్రసాద్

కారంచేడు: సినీ నిర్మాత, మూవీ మొఘల్, మాజీ ఎంపీ డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు తమ్ముడు, సినీ నిర్మాత దగ్గుబాటి రామ్మోహన రావు((మోహన్‌బాబు) ఈ నెల 4వ తేదీన మృతి చెందిన విషయం తెలిసిందే. మోహన్ బాబు కుటుంబానికి సన్నిహితులు, బంధువు అయిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్న మనేని రామకృష్ణప్రసాద్ మంగళవారం సాయంత్రం కారంచేడు వచ్చారు. మోహన్ బాబు సతీమణి శారదాదేవిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

కామన్‌వెల్త్ ప్రిలిమినరీ పోటీలకు ప్రేమ్‌సాగర్



దేవరకొండ ప్రేమసాగర్

చీరాల రూరల్: కామన్‌వెల్త్ యూత్, జూనియర్, సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2023 పోటీలు జూలై 11 నుంచి 16 వరకు ఢిల్లీలో జరుగనున్నాయి. పోటీల్లో పాల్గొనేందుకు చీరాల మండలం బుర్లవారిపాలెం పంచాయతీ సాయికాలనీకి చెందిన దేవరకొండ ప్రేమ్‌సాగర్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి ఆహ్వానం అందినట్లు ఉమ్మడి జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ పున్నారావు, విశ్రాంత డీఎస్‌డీవో శ్రీనివాస ప్రసాద్‌లు తెలిపారు. మే 10వ తేదీలోగా ప్రేమ్‌సాగర్ పాటియాల చేరుకోవాలని వారు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రేమ్‌సాగర్ అనేక పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ చూపి పతకాలు సాధించాడు. ప్రస్తుతం 73 కేజీల విభాగంలో మన బాపట్ల జిల్లా నుంచి ఏపీ తరఫున ప్రేమసాగర్ ఒక్కడే ఎంపిక కావడంపై క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించి దేశానికి మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలని క్రీడా ప్రేమికులు కోరుతున్నారు.

పెండింగ్ రుణాలు చెల్లించాలి

● డీఆర్‌డీఏ పీడీ అర్జున్‌రావు



మాట్లాడుతున్న పీడీ అర్జునరావు

బల్లికురవ: ప్రభుత్వం పొదుపు గ్రూపుల బలోపేతానికి మహిళల జీవనోపాధుల పెంపుదలకు అందిస్తున్న స్త్రీనిధి, శ్రీఏఎఫ్, ఉన్నతి, బ్యాంకు లింకేజీ రుణాలు సకాలంలో చెల్లించాలని జిల్లా డీఆర్ డీఏ పీడీ డాక్టర్ బీ. అర్జున్ రావు కోరారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మంగళవారం మండలంలోని 42 గ్రామైక్య సంఘాలతో సమీక్ష నిర్వహించారు. 2022–23 సవత్సరానికి స్త్రీనిధి, సీఏఎఫ్ ఉన్నతి, బ్యాంక్ లింకేజీ రుణాలు రూ.52 కోట్ల వరకు దజేసినట్లు చెప్పారు. సూరేపల్లి, పెద అంబడిపూడి, కొప్పరపాడు, గ్రామైక్య సంఘాల దాదాపు రూ.22 లక్షలు రుణాలు చెల్లించకపోవటంపై పీడీ అసహనం వ్యక్తం చేశారు. 2023–24 సంవత్సరానికి రుణ లక్ష్యాలను పెంచనున్నట్లు పీడీ ప్రకటించారు. సమీక్షలో ఏపీఎం టీ. సురేంద్రబాబు, స్త్రీనిధి మేనేజర్ శంకర్, సీసీలు పాల్గొన్నారు.

పరీక్ష ఫెయిల్ అవుతానన్న భయంతో బాలిక బలవన్మరణం

మార్టూరు: పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని తాను ముందురోజు రాసిన పరీక్ష ఫెయిల్ అవుతానన్న అనుమానంతో బలవన్మరణానికి పాల్పడిన సంఘటన బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని దేగరమూడి గ్రామంలో మంగళవారం జరిగింది. సీఐ ఎస్‌కేటీ ఫిరోజ్, ఉపాధ్యాయులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఆదర్శ నగర్ కాలనీకి చెందిన ముక్తిపాటి అంకమ్మరావు, పుణ్యవతి దంపతులు కుమార్తె నాగపూజిత (15) ప్రస్తుతం మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తోంది. మంగళవారం ఉదయం తల్లిదండ్రులు పనుల మీద బయటకు వెళ్లగా నాగపూజిత తమ ఇంటిలోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. సుమారు 11 గంటల సమయంలో నాగపూజిత అమ్మమ్మ, తాతయ్యలు ఇంటిలో ఫ్యానుకు వేలాడుతున్న మనుమరాలిని గమనించి, స్థానికుల సహాయంతో కిందకు దించి 108 వాహనం ద్వారా మార్టూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాలికను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సీఐ ఫిరోజ్ ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికి నాలుగు పరీక్షలు రాసి మరో రెండు పరీక్షలకు సిద్ధమవుతున్న నాగపూజిత తెలివైన, చిరుకైన విద్యార్థిని అని, అయితే ముందు రోజు రాసిన లెక్కలు పరీక్షలో మార్కులు తగ్గుతాయనే అనుమానంతో ఆందోళనకు గురై ఇంటిలో ఎవరూ లేని సమయం చూసి ఈ దారుణానికి పాల్పడినట్లు తండ్రి అంకమ్మరావు పోలీసులు ఎదుట వాపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పూలే జీవితం ఆదర్శం

● ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి

ఒంగోలు: 'పూలే జీవితం ఆదర్శమని, ఆయన చూపిన బాటలో అందరూ నడవాలని' జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహానికి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్మన్ సింగరాజు మీనాకుమారి, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి ఎస్.లక్ష్మానాయక్, డీఆర్‌ఓ శ్రీలత తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ పూలే ఆశయాలను కొనియాడారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం మహాత్మా జ్యోతిరావు పూలే పడిన తపన, కృషి నేడు సమాజంలో ఉన్నతంగా రాణించేందుకు అవసరమైన ఫలాలను అందిస్తున్నాయన్నారు. అటువంటి పూలే పేరు మీదుగా ఒంగోలులో ఒక భవన్ ఉండాలని బీసీ సామాజిక వర్గాలు చేసిన విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకుని కలెక్టర్‌తో మాట్లాడి త్వరలోనే స్థలం కేటాయించేలా చూస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల అభివృద్ధి కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టడమే కాకుండా రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం అత్యధిక స్థానాలు బీసీలకే కేటాయించిన విషయాన్ని గమనించాలన్నారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ మహారాష్ట్రలో జన్మించిన పూలే ఆనాడు నెలకొన్న సామాజిక పరిస్థితుల్లో ఎంతో దారుణమైన వివక్షను చవిచూశారన్నారు. అటువంటి వివక్షను సమాజం నుంచి తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ పూలే చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, కటారి శంకర్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు బంకా చిరంజీవి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు, 24వ డివిజన్ కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ, చాత్తాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్, బీసీ, ఎస్సీ సంఘాల నేతలు, పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత తదితరులు

గొప్ప సంఘ సంస్కర్త పూలే

ఒంగోలు టౌన్: సంఘ సంస్కర్త, ప్రజా ఉద్యమకారుడు, అంటరానితనం లాంటి దురాచారాలకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేసిన జ్యోతిరావు పూలే చూపిన బాటలో పయనిద్దామని ఎస్పీ మలికాగర్గ్ పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కుల వ్యవస్థకు నిర్మూలన కోసం, బాలబాలికలు, బడుగు బలహీన వర్గాల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధి కోసం పూలే దంపతులు జీవితాలను త్యాగం చేసిన తీరును కొనియాడారు. బాల బాలికలు, మహిళల విద్య కోసం చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆ మహనీయుని ఆదర్శాలను పాటిస్తూ ముందుకు సాగాలని కోరారు. ట్రైనీ ఐపీఎస్ అంకిత సురాన, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, డీపీఓ ఏఓ సులోచన, ఆర్ఐ శ్రీహరిరెడ్డి, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ మలికాగర్గ్



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ.

పూలే బాటలో పయనిద్దాం

● వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు అంకితమవుదామని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డితో కలిసి భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే ఒక గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. సమాజంలో నెలకొన్న వివక్షను రూపుమాపేందుకు విద్య అనే ఆయుధాన్ని చేపట్టారన్నారు. స్త్రీ విద్యను ప్రోత్సహించేందుకు భార్యను తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా దేశానికి పరిచయం చేశారని కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఇదే తరహాలో విద్యా రంగాన్ని ప్రోత్సహించేలా అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యాదీవెన వంటి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా తీసుకుని అడుగులు వేస్తున్నారన్నారు. అందులో భాగంగానే అనేక సామాజిక వర్గాలకు ప్రత్యేక గుర్తింపు ఇస్తూ నామినేటెడ్ పదవులు కేటాయించారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ మహిళల పట్ల సమాజంలో నాడు నెలకొన్న వివక్షను రూపుమాపేందుకు పూలే కృషి చేశారని, నేడు అదే బాటలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని కొనియాడారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ మహిళ విద్యావంతురాలైతే కుటుంబం మొత్తం సంతోషంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని భావించి నేడు మహిళలకు సీఎం అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, బీసీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, యువజన విభాగం మాజీ జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర, టైలర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ షేక్ సుభానీ, చాత్తాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్, ఒడా చైర్మన్‌సింగరాజు మీనాకుమారి, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు మారెళ్ల శ్రీదేవి శ్రీనివాస్, గోనుగుంట రజని, తిర్లిక శ్రీనివాసులు, దాసరి కరుణాకర్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఒంగోలు నియోజకవర్గ అధ్యక్షురాలు బైరెడ్డి అరుణ, పల్లా అనూరాధ, కావూరి సుశీల తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి



రాజశ్యామల యాగంలో పూజలు నిర్వహిస్తున్న బాలినేని దంపతులు

● ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి రైతులు ఆనందంగా ఉండాలని కోరుకుంటూ రాజశ్యామల యాగం చేయిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఒంగోలులోని టీటీడీ కల్యాణ మండపంలో వేదపండితుల సమక్షంలో రాజ శ్యామల యాగాన్ని మంగళవారం ప్రారంభించారు. వేద పండితుడు మఠంపల్లి దక్షిణమూర్తి నేతృత్వంలో యాగ క్రతువులు ప్రారంభించారు. ఉదయం బాలినేని స్వగృహంలో బాలినేని దంపతులచే కృతికా స్నానం చేయించారు. అనంతరం టీటీడీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన యాగశాల వద్ద మండపారాధన నిర్వహించారు. రాజ శ్యామలాదేవి సహిత మహా మండపారాధన, గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీప స్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని దంపతులకు దీక్షా కంకణాధారణ చేశారు. పండితుల సమక్షంలో అగ్ని ప్రతిష్ఠాపన చేశారు. గణపతి హోమం అనంతరం మండప పూజ, చతుర్వేద పారాయణం, మహాదీపారాధన, మంత్ర పుష్పం నిర్వహించి రాజ శ్యామలాదేవికి దర్బారు సేవను వేదోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.



యాగంలో పూజలు చేస్తున్న బాలినేని దంపతులు

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

● ఎస్పీ మలికాగర్గ్

మార్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మార్కాపురం పర్యటన సందర్భంగా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. పట్టణంలోని సౌజన్య కల్యాణ మండపంలో పోలీస్ అధికారులతో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటనకు ముగ్గురు అదనపు ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 37 మంది సీఐలు, ఆర్ఐలు, 111 మంది ఎస్సైలు, 285 మంది ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 489 కానిస్టేబుళ్లు, 127 మంది మహిళా కానిస్టేబుళ్లు, 392 మంది హోంగార్డులు, ఆర్ఎస్సైలు, ఏఆర్ సిబ్బంది మొత్తం 1700 మందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. హెలిప్యాడ్ నుంచి సభా వేదిక ప్రాంతం వరకు ఉన్న పాయింట్‌లలో ఉండే అధికారులు అనుక్షణం జాగ్రత్తగా ఉండాలన్నారు. అవసరమైన చోట బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. సీఎం పర్యటనలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ట్రాఫిక్ బందోబస్తులో ఉండే అధికారులు ట్రాఫిక్ నియంత్రణ, మళ్లింపు సవ్యంగా జరిగేలా చూడాలని, బయట నుంచి వచ్చే వాహనాలు కేటాయించిన స్థలాల్లోనే పార్కింగ్ చేయాలని చెప్పారు.

సమావేశంలో అదనపు ఎస్పీలు నాగేశ్వరరావు, శ్రీధర్‌రావు, ట్రైనీ ఐపీఎస్ అధికారి అంకిత సురాన తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

బైక్‌లు ఢీకొని యువకుడు మృతి

● మరో యువకునికి తీవ్ర గాయాలు

కొండపి: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందగా మరో యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కె.ఉప్పలపాడులో పాపారావు హైస్కూల్ సమీపంలో మంగళవారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని చినవెంకన్న పాలెం ఎస్సీ కాలనీకి చెందిన కట్టా సంపత్ (38) ద్విచక్ర వాహనం మీద ఉప్పలపాడు వెళ్లి తిరిగి గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో కట్టుబడిపాలెం గ్రామంలో పచ్చాకు కూలీగా పని చేస్తున్న బాపట్ల జిల్లా బైటమంజులూరు గ్రామానికి చెందిన చింతల నాగేంద్రబాబు అదే మార్గంలో కట్టుబడిపాలెం నుంచి ద్విచక్ర వాహనంపై ఉప్పలపాడు వైపు వస్తుండగా పాపారావు హైస్కూల్ సమీపంలో ఎదురుదెరుగా ఢీకొని కిందపడ్డారు. ప్రమాదంలో సంపత్‌కు తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు కారులో వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో టంగుటూరు దాటిన తర్వాత మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. ప్రమాదంలో తీవ్ర గాయాలైన నాగేంద్రబాబును 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.



సంఘటనా స్థలంలో తీవ్ర గాయాలతో ఉన్న సంపత్

సత్తా చాటిన జేసీ అగ్రహారం ఎడ్లు



బండ లాగుతున్న ఎడ్లు

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో పట్టాభిరామ స్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా మంగళవారం రాష్ట్రస్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో మండలంలోని జేసీ అగ్రహారం లక్కు మునీశ్వరయ్య ఎడ్లు 2874 అడుగులతో మొదటిస్థానం, అర్ధవీడు మండలం షేక్ జాఫర్‌సాయబ్ ఎడ్లు 2816 అడుగులతో ద్వితీయస్థానం, వైఎస్సార్ జిల్లా కాశినాయన మండలం చల్లా శివారెడ్డి ఎడ్లు 2400 అడుగులతో మూడవ, టంగుటూరుకు చెందిన మక్కెన కోటేశ్వరరావు ఎడ్లు 2319 నాల్గవస్థానంలో, గిద్దలూరుకు చెందిన దుర్వాసుల నారాయణ ఎడ్లు 2282 అడుగులు లాగి ఐదవస్థానంలో, వైఎస్సార్ జిల్లా తెల్లపాడుకు చెందిన వడ్డె పోగు జయన్న ఎడ్లు 2282 అడుగులు లాగి ఆరవస్థానంలో, జేసీ అగ్రహారం లక్కు సాత్విక్ ఎడ్లు 2200 అడుగులతో ఏడోస్థానంలో నిలిచాయి. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల బహుమతులను దాతలు, ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు.

బొబ్బేపల్లిలో మైనింగ్ అధికారుల తనిఖీ



గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతం

మార్టూరు: మండలంలోని బొబ్బేపల్లి గ్రామంలో మైనింగ్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రీజినల్ విజిలెన్స్ స్క్వాడ్ అధికారి జగన్నాథరావు, అసిస్టెంట్ జియాలజిస్ట్ రమేష్ కుమార్ రెడ్డి పరిశీలించి మాట్లాడారు. బొబ్బేపల్లి కొండ సమీపంలో సర్వే నంబర్ 387లో గ్రావెల్ తవ్వకాలు కోసం అదే గ్రామానికి చెందిన కుంచపు వీరాంజనేయులు గతంలో అనుమతులు తీసుకుని ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలకు పాల్పడుతున్నారంటూ వీరాంజనేయులు గత సోమవారం బాపట్ల గ్రీవెన్స్ సెల్‌లో అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో అధికారులు మంగళవారం సాయంత్రం గ్రామంలో మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించారు. ఈ విషయమై అసిస్టెంట్ జియాలజిస్ట్ మాట్లాడుతూ గ్రావెల్ తవ్వకాలు ఇతరులు జరుపుతున్న మాట వాస్తవమేనని కానీ కుంచపు వీరాంజనేయులుకు అనుమతులిచ్చిన ప్రాంతంలో తవ్వకాలు జరగడం లేదన్నారు. అయితే సర్వే నంబర్ 387లో వెలుపల వైపు గ్రామస్తులు తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో రోడ్లు తదితర అవసరాలు కోసం 1100 ట్రక్కుల గ్రావెల్ అవసరమైనందున అందుకోసమై పంచాయతీ తీర్మానం చేసుకొని తవ్వకాలు జరిపారని పంచాయతీ సర్పంచ్ వర్గం చెప్తున్నట్లు తెలిపారు. రీజినల్ విజిలెన్స్ స్క్వాడ్ అధికారి మాట్లాడుతూ కేవలం పంచాయతీ తీర్మానం చేసుకొని గ్రావెల్ తవ్వకాలు జరుపుకుంటామంటే కుదరదని, మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతులు తీసుకుంటేనే తవ్వకాలు జరుపుకోవాలని చెప్పటం గమనార్హం. నేడు గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాన్ని పూర్తిగా సర్వే నిర్వహించి శాఖపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. అధికారులు భాస్కర్‌రెడ్డి, రాజీనాయుడు, స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే నెలలో జీ ప్లస్ 3 ఇళ్లు అందిస్తాం

● టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్



ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

కందుకూరు అర్బన్: పట్టణంలోని ఉప్పుచెరువు సమీపంలో జీప్లస్‌త్రీ ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు మే మొదటి వారంలో అందించేలా కార్యచరణ చేపట్టాలని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. జీప్లస్‌త్రీ ఇళ్లు పనుల పురోగతిని టిడ్కో ఇంజినీర్లతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. జీప్లస్‌త్రీ ఇళ్ల మ్యాపును పరిశీలించి కమిషనర్ ఎస్. మనోహర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణీతకాల వ్యవధి లోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేందుకు అధికారులు, ఏజెన్సీ సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. కమిషనర్ ఎస్. మనోహర్ మాట్లాడుతూ జీప్లస్‌త్రీలో బ్యాంకు రుణం తీసుకొని రిజిస్ట్రేషన్ చేసిన లబ్ధిదారులకు మాత్రమే గృహాలు అందజేస్తామని తెలిపారు. టిడ్కో సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.చినకోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి. వెంకటేశ్వరరావు, మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం కె. శ్రీనివాసులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు: పదో తరగతి పరీక్షల్లో సైన్స్ పరీక్ష రాసే విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది సైన్స్ పరీక్షలో ఫిజిక్స్, బయోలాజికల్ సైన్స్ రెండు ఒకే పేపర్‌లో ఉంటాయన్నారు. పార్ట్–ఏలో ఫిజిక్స్ ప్రశ్నలు 1 నుంచి 16 వరకు, పార్ట్ బీలో బయోలాజికల్ సైన్స్ ప్రశ్నలు 17 నుంచి 33 వరకు ఉంటాయన్నారు. జవాబులు రాసేందుకు ఓఎంఆర్‌లు రెండు ఇస్తామని, ఒక్కోటి 12 పేజీలు ఉంటుందన్నారు. ఫిజికల్ సైన్స్ ఓఎంఆర్ కోడ్‌పై సైన్స్ పి–1 అని, బయోలాజికల్ సైన్స్ ఓఎంఆర్‌పై పేపర్ కోడ్ –20, సైన్స్ పి–2 అని ఉంటుందన్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టు సమాధానాలను ఆ సబ్జెక్టుకు సంబంధించిన బుక్‌లెట్‌లోనే రాయాలన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని జాగ్రత్తగా గమనించాలన్నారు. ఇన్విజిలేటర్లు కూడా విద్యార్థులు ఈ విషయమై పరీక్ష గదిలో పరీక్ష ప్రారంభానికి ముందు అవగాహన కల్పించాలన్నారు.